సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 21 । జూలై । 2023



ఎడతెరిపిలేని వర్షం..
జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా పడుతున్న వానతో ప్రాజెక్టులు, చెరువుల్లోకి వరదనీరు వచ్చి, జలకళ సంతరించుకున్నాయి. 8లో▸



బొగ్గు ఉత్పత్తికి ఆటంకం
కమాన్‌పూర్: వర్షాలకు ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2లో బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపునకు ఆటంకం కలిగింది. ఏరియాలో ప్రతిరోజు 14,500 టన్నుల బొగ్గు అవుతుంది. వర్షాలతో ఉత్పత్తి నిలిచిపోయింది.

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రోడ్లు అస్తవ్యస్తం



లక్ష్మీనగర్‌లో బంద్ పరిశీలిస్తున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గోదావరిఖని ప్రధాన వ్యాపార కూడలి లక్ష్మీనగర్ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు, డ్రైనేజీల తీరును నిరసిస్తూ గురువారం గోదావరిఖనిలో బంద్ పాటించారు. పలు డివిజన్‌లో పర్యటించి బంద్‌ను పర్యవేక్షించారు. ఏడాది కాలంగా లక్ష్మీనగర్ రోడ్లు అధ్వానంగా మారాయని, మరమ్మతు చేయాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కమీషన్‌ల కోసం ఎమ్మెల్యే, మేయర్ అభివృద్ధి పనులను జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. బంద్‌ను విజయవంతం చేసిన వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తఫా, గాదం విజయ, పెద్దెల్లి ప్రకాష్, నగునూరి రాజు, గట్ల రమేశ్, యుగేందర్, మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేష్, ద్యావనపల్లి చక్రపాణి, ఈదునూరి హరిప్రసాద్, పెండ్యాల మహేష్, సింగం కిరణ్‌గౌడ్, నజీముద్దీన్, దులికట్ట సతీశ్, చుక్కల శ్రీనివాస్, తిప్పారపు శ్రీనివాస్, గడ్డం శేఖర్, దాసరి విజయ్, ఉదయ్‌రాజ్, ఇదునూరి హరిప్రసాద్ పాల్గొన్నారు.

బీసీలకు టీటీడీ బోర్డులో చోటు కల్పించండి



టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న రాజ్ కుమార్

సుల్తానాబాద్: తెలంగాణకు చెందిన బీసీ నాయకులకు టీటీడీ పాలకమండలిలో ప్రాధాన్యత కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్ కుమార్ కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కష్ణయ్యతో కలిసి టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డికి వినతిపత్రం అందించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యత్వంలో తెలంగాణ వారికి ప్రాతినిధ్యం తక్కువగా ఉందని, ఈ క్రమంలో బీసీలకు స్థానం కల్పించాలని కోరారు. భక్తులకు స్వామివారి దర్శనం త్వరగా అయ్యేలా చూడాలన్నారు. తిరుమల తరహాలోనే ఇతర ఆలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ



ఆర్డీఓ మధుమోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఓ, సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిగా మధుమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జనగాం ఆర్డీఓగా పనిచేసిన ఈయన బదిలీపై జిల్లాకు రాగా.. కార్యాలయం ఏఓ అనుపమ, రాజనరేందర్‌గౌడ్, అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతుబీమా పూర్తి చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఏవో ఆదిరెడ్డి

కమాన్‌పూర్: పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకూ బీమా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. కమాన్‌పూర్ ఏవో కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో రైతుబీమా, సాగు వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రతలను రైతులకు వివరించాలని సూచించారు. ఆయిల్‌పాం సాగు కమాన్‌పూర్ మండలంలోనే అధికంగా ఉందని అధికారులను అభినందించారు. జూలపల్లిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఏవో బండి ప్రమోద్‌కుమార్, ఏఈవోలు యాదగిరి శ్రీనివాస్, సురేష్ ఉన్నారు.

ఈ చిత్రంలో భారీ గుంతలు పడి కనిపిస్తున్నది సెంటీనరికాలనీ వద్ద మంథని – పెద్దపల్లి ప్రధాన రహదారి. నిత్యం ఈ రహదారి మీదుగానే మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తుంటారు. అయినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ గుంతలు కనపడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు అంటున్నారు.



గుంతలమయం..

అడుగు పెట్టాలంటే భయం

ఎక్కడ చూసినా అన్నీ ఛిద్రాల రోడ్లే..

బల్దియాల్లో మరీ అధ్వానంగా అంతర్గత రోడ్లు

- భయం గుప్పిట్లో వాహనదారులు, ప్రయాణికులు
- మండలకేంద్రాలకు వెళ్లలేం.. జిల్లా కేంద్రానికి చేరలేం
- గుంతలతో నడుములు విరుగుతున్నాయంటున్న ప్రజలు

సాక్షి, పెద్దపల్లి: ఒకవైపు బురద.. మరోవైపు గోతులు.. వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. ఏ రోడ్డు చూసినా ఏముంది గర్వకారణం.. సర్వం అధ్వానమయం అన్నట్లుగా మారింది పరిస్థితి. ఎడతెరిపిలేని వర్షాలతో రహదారులు ఛిద్రమయ్యాయి. మరి కొన్నిచోట్ల అధికారుల నిర్లక్ష్యంతో గుంతలమయంగా మారాయి. అసలే వర్షాకాలం .. ఆపై గుంతలు పడిన రోడ్లు.. ఏ గుంత ఎక్కడుందో తెలియక దూసుకుపోతున్న వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గుంతలమయం రోడ్లతో నిత్యం ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు కిందపడుతూ గాయలపాలవుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉండే అంతర్గత రోడ్లలో కూడా ఇదే దుస్థితి. కొన్ని రోడ్లు చెరువులను తలపిస్తుండగా మరికొన్ని రోడ్లు వాహనదారుల నడ్డి విరుస్తున్నాయి. ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ నీళ్లు ఉన్నాయో తెలియక వాహనదారులు హడలిపోతున్నారు.

బల్దియాల్లో నడవాలంటే నరకమే...

జిల్లాలో రామగుండం కార్పొరేషన్ సహా పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు ఉన్నాయి. అన్ని డివిజన్‌లలోని కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. అస్తవ్యస్తమైన రోడ్లు, డ్రైనేజీలతో వర్షం వస్తే రహదారులు బురదమయంగా మారుతున్నాయి. చిన్న వర్షానికే వరదనీరు ,మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో అడుగు బయట పెట్టాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందేనని స్థానికులు అంటున్నారు. రాత్రివేళ్లల్లో కాలనీల్లో తిరగాలంటే ప్రమాదరకంగా మారింది. అలాగే జిల్లాకేంద్రం నుంచి మండలాలు, పల్లెలకు వెళ్లే దారులు సైతం చాలా చోట్ల ఛిద్రమై ప్రమాదరకంగా మారాయి. వర్షాకాలం నేపథ్యంలో గుంతలను పూడ్చాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలలో నీరు నిలిచి ప్రమాదకరంగా ఉన్నాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది సుల్తానాబాద్ మున్సిపాలిటీలోనిది. నిత్యం ఈ రోడ్డు మీదుగా ఓవర్‌లోడ్‌తో లారీలు వెళ్తుండటంతో రోడ్డంతా గుంతలు పడి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. రాత్రి వేళల్లో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది రామగుండం కార్పొరేషన్ పరిధిలోని సప్తగిరికాలనీకి వెళ్లే మార్గం. కొన్నేళ్లుగా ఈ రోడ్డు మొత్తం గుంతలమయంగా ఉంటూ.. ప్రమాదాలకు కేంద్రంగా మారింది. తాజాగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే నరకయాతన పడాల్సి వస్తోందని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది రామగుండం కార్పొరేషన్ పరిధి దుర్గానగర్‌కాలనీకి వెళ్లే మార్గం. చిన్నపాటి చినుకులు పడినా.. రోడ్డంతా బురదగా మారుతోంది. కార్పొరేషన్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి రోడ్లకు మరమ్మతు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గోదావరిఖనిలో వ్యాపారులు బంద్ పాటించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది రామగుండం కార్పొరేషన్ పరిధి 17వ డివిజన్ సంతోష్‌నగర్‌లోని సీసీ రోడ్డు దుస్థితి. సీసీ రోడ్డు మొత్తం కొట్టుకుపోయి వానతో బురదమయంగా మారి రాకపోకలకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది రామగుండం కార్పొరేషన్ పరిధి ప్రశాంతినగర్‌లోనిది. అడుగడుగునా గుంతలతో ఛిన్నాభిన్నంగా ఉన్న ఈ రోడ్డుపై చినుకు పడితే ప్రయాణించాలంటే నగరవాసుల్లో వణుకు పుడుతోంది.



నడుస్తూ.. పరిశీలిస్తూ.. ఆదేశాలిస్తూ..







గోదావరి రోడ్డులో కాలినడకన వెళ్తున్న కలెక్టర్, మాతాశిశు ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో సమావేశం, వరద ముంపు బాధితులతో మాట్లాడుతూ..

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మార్క్
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన
- మాతాశిశు ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ
- అధికారులకు సూచనలు

మంథని: కొత్త కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంథని మున్సిపాలిటీలో పర్యటించారు. భారీవర్షాల నేపథ్యంలో గతంలో వరద ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. గోదావరి నది వైపు వచ్చి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వాహనం దిగారు. గతేడాది వరద ఎక్కడివరకు వచ్చిందో తెలుసుకుని నడుచుకుంటూ పవర్ హౌస్‌కాలనీ చింతల మీదుగా ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌ను ఆరా తీశారు. ఎదురుగా కనిపించిన వెంచర్‌కు అనుమతులు ఉన్నాయా అని తెలుసుకుని అనుమతి లేకుంటే ఆపాలని ఆదేశించారు. అక్కడి నుంచి బొక్కలవాగును పరిశీలించారు. వరద ఉధృతిని గమనించారు. కొద్ది దూరం నడచుకుంటూ వెళ్లే సమయంలో అధికారులతో ఫ్రెండ్లీగా ముచ్చటిస్తూనే సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మాతాశిశు ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బందితో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అమ్మా అంటూ పలుకరించారు. ప్రసవాలపై ఆరా తీసి హాజరు రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. నర్సింగ్ స్టాఫ్, వైద్యులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ ఇలా అందరితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కంది శ్రీనివాస్‌తో మాట్లాడారు. వైద్య సిబ్బంది పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత టీఎస్ఎంఐడీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి..

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పునరావాస కేంద్రం, ఇతరత్రా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలిపోయే అవకాశమున్న క్రమంలో వాటిని గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేకుడా చూడాలన్నారు. ఉన్నతాధికారిగా హుందాగా వ్యవహరిస్తూనే.. ఫ్రెండ్లీ మాట్లాడి తనదైన మార్క్ చూపించారు. ఆయన వెంట ఆర్డీఓ వీరబ్రహ్మాచారి, తహసీల్దార్ సిరిపురం గిరి తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

సాక్షి, పెద్దపల్లి: బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలో 15 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు గురువారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ముసుగులో వచ్చిన పాస్‌పోర్ట్ దొంగలు, దొంగనోట్లు చెలామణి చేసే వ్యక్తులకు అధికారమిస్తే పరిస్థితులు ఇలానే ఉంటాయని విమర్శించారు. పారిశుధ్య కార్మికులు సమ్మె వీడి విధుల్లో చేరితే వారి డిమాండ్లను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హరీశ్‌రావు ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో చీమ చిటుక్కుమన్నా పోలీసు నిఘాతో తెలుసుకునే కేసీఆర్‌కు 15 రోజులుగా 50 వేల మంది పారిశుధ్య కార్మికులు రోడ్లపై నిరవధిక సమ్మె చేస్తుంటే తెలియదని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

కరెంట్‌పై కాంగ్రెస్ అసత్య ప్రచారాలు



ట్రాక్టర్లతో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

రామగుండం: కరెంట్‌పై కాంగ్రెస్ అసత్య ప్రచారాలు చేస్తోందని అరవై ఏళ్ల పాలనలో ఆ పార్టీ ఏం చేసిందో రైతులకు తెలుసని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లిలో రైతు సంక్షేమ ర్యాలీ నిర్వహించారు. రైతులతో కలిసి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీగా రైతుభవన్‌కు చేరుకున్నారు. వ్యవసాయం దండుగ అన్న అప్పటి సీఎం చంద్రబాబువారసుడు రేవంత్‌రెడ్డి అని, అందుకే రైతులకు మూడు గంటల కరెంట్ సరిపోతుందంటున్నారని ఎద్దేవా చేశారు. నిరంతర విద్యుత్ ఇచ్చే సీఎం కేసీఆర్‌నే మళ్లీ గెలిపించుకుందామని తీర్మానం చేశారు. జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, సర్పంచ్ బండారు ప్రవీణ్, సర్పంచులు పాల్గొన్నారు.

తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్

గోదావరిఖని: రాష్ట్రానికి పట్టిన శని కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్యే అన్నారు. గురువారం స్థానిక లక్ష్మీనగర్‌లో పర్యటించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం దేశం గర్వంచేలా ఎదిగిందన్నారు. లక్ష్మీనగర్‌లో అభివృద్ధి కాంగ్రెస్‌కు కనిపించడం లేదని, అందుకే వ్యాపారులను బెదిరించి బంద్ చేయించిందని తెలిపారు.

సీఎం కేసీఆర్‌తో తీరిన కరెంట్ కష్టాలు



పందిల్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యలతో కరెంట్‌తోపాటు సాగునీటి కష్టాలు తీరాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పందిల్ల రైతు వేదికలో 'రైతన్న మేలుకో' కార్యక్రమంలో మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టాలని సూచించారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, సర్పంచు దాసరి లావణ్య, పీఏసీఎస్ చైర్మన్లు చదువు రాంచంద్రా రెడ్డి, గజవెల్లి పురుషోత్తం, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ దేవయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాజుగా మారిన రైతు

ఓదెల: ఓదెల మండలం గుండ్లపల్లెలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు రాజుగా మారాడని పేర్కొన్నారు. 2014కు ముందు కాంగ్రెస్ ఏం చేసిందో అందరికీ తెలుసున్నారు. సర్పంచు పులుగు తిరుపతిరెడ్డి, ఎంపీపీ రేణుకాదేవి, రైతుసమన్వయ సమితి జిల్లా చైర్మన్ అనంతరెడ్డి, పెద్దపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌లో మాట్లాడుతూ.. మూడు గంటలు చాలంటున్న కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలన్నారు. మండలంలోని చిన్నకల్వల రైతు వేదికలో రైతన్న మేలుకో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ బాలాజీరావు, సింగిల్‌విండో చైర్మన్ మోహన్‌రావు, జూపల్లి సందీప్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



ఈవీఎం స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లావ్యాప్తంగా ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై ప్రచారం కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీప్యాట్ అవగాహన కేంద్రాన్ని, నియోజకవర్గాల పరిధిలో ఓటు వేసే విధానంపై ప్రచారం చేసేందుకు ఏర్పాటు చేసిన మూడు రథాలను అడిషనల్ కలెక్టర్ ప్రియాంకతో కలిసి ప్రారంభించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూమ్ కు ఈవీఎంలను తరలించామన్నారు. ఓటున్న వారందరికీ అవగాహనకు అసెంబ్లీ నియోజకవర్గానికో వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. వాహనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, తూము రవీందర్, ఎన్నికల డీటీ ప్రవీణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ట్రినిటీ' విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



పోచారం ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు టాస్క్ వారి సహకారంతో గురువారం హైదరాబాద్‌లోని పోచారం ఇన్ఫోసిస్ ఇండస్ట్రీని సందర్శించారు. వర్క్‌షాప్ ఆన్ డ్రీమ్స్ టు రియాలిటీ అనే అంశంపై సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ ఫైనలియర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాన్వా డిజైనింగ్ అండ్ స్ప్రింగ్ బోర్డు యాప్‌పై వివరించారు. ఐటీ కంపెనీల్లో ఆధునిక పద్ధతులు తెలుసుకునేందుకు, సాంకేతికతపై అవగాహన పెంచుకునేందుకు ఇండస్ట్రియల్ విజిట్ దోహదపడుతుందని అకాడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశ్ అన్నారు. టాస్క్ కో–ఆర్డినేటర్ కౌసల్య, స్వాతి, కృష్ణయ్య, మధుశేఖర్ ఉన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



లింగయ్య (ఫైల్)

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన అమరపెల్లి లింగయ్య(45) గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. లింగయ్య గురువారం ఉదయం 6 గంటలకు తన సెలూన్‌కు వెళ్లి, లోపల శుభ్రం చేస్తున్నాడు. ఆ సమయంలో గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతుడి తల్లి రాజమ్మ 20 రోజుల క్రితమే మృతిచెందింది. ప్రస్తుతం లింగయ్య కూడా చనిపోవడంతో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గొర్రెల పైకి దూసుకెళ్లిన కారు

- ఐదు జీవాలు మృతి.. కాపరికి గాయాలు

మంథని: గొర్రెల పైకి కారు దూసుకెళ్లిన ఘటనలో కాపరి గాయపడగా, మూడు జీవాలు మృతిచెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ పరిధి నెల్లిపల్లికి చెందిన చిన్నరాజయ్య గురువారం రాత్రి తన గొర్రెలను తోలుకొని వెళ్తున్నాడు. ఆ సమయంలో మంథని నుంచి కాటారం వైపు వెళ్తున్న కారు గొర్రెల పైకి దూసుకెళ్లింది. మూడు గొర్రెలు చనిపోగా, కాపరితోపాటు మరికొన్నింటికి గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు మంథని ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు కరీంనగర్ తీసుకెళ్లారు.

నలుగురు సీఐల బదిలీ

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీఎస్‌బీ–3 రామగుండం సీఐ గంగాధర రమేశ్‌బాబును శ్రీరాంపూర్‌కు, శ్రీరాంపూర్ సీఐ ముత్తి లింగయ్యను హైదరాబాద్ ఐజీపీ కార్యాలయానికి, పీసీఆర్ సిద్దిపేటలో పని చేస్తున్న ఎస్.దేవయ్యను సీసీఎస్–3 రామగుండం కమిషనరేట్‌కు, రామగుండం కమిషనరేట్ వీఆర్–2 సీఐ కె.శశిధర్‌ను ఎల్లారెడ్డిపేట సర్కిల్‌కు బదిలీ చేశారు.

పోతారం 'ఎత్తిపోతల' ఉత్తదేనా?

- సీఎం కేసీఆర్ ఆదేశాలకు ఏడాది.. అమలేది?
- రూ.320 కోట్ల మంజూరుకు ఆర్థిక శాఖ అనుమతి
- పెండింగ్‌లో పరిపాలన అనుమతులు
- సాగుకు నోచుకోని 30 వేల ఎకరాలకు పైగా భూములు
- పథకంపై రైతుల్లో సన్నగిల్లుతున్న ఆశలు





పోతారం ఎత్తిపోతలపై సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం ఇస్తున్న జెడ్పీ చైర్మన్ మధు (ఫైల్), మంథని మండలంలోని నాగారం శివారులో సాగుకు నోచని భూములు

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పార్వతీ బ్యారేజీకి అనుసంధానంగా పోతారం వద్ద ప్రతిపాదిత ఎత్తిపోతల పథకంపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. నాలుగేళ్లుగా ఎత్తిపోతల కోసం ఎదురుచూస్తుండగా ఎన్నికలు సమీపిస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడంతో ఎత్తిపోతలు ఉత్తవేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తలాపునే గోదావరి.. అందని సాగునీరు

పెద్దపల్లి జిల్లాలోని మంథని నియోజకవర్గం టెయిలెండ్ ప్రాంతం కావడంతో వర్షాధారిత పంటలనే సాగు చేస్తున్నారు. తలాపునే గోదావరి ప్రవహిస్తున్నా రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి వచ్చే నీరు అన్ని ప్రాంతాలకు చేరడం లేదు. డీ–83 కాల్వ ద్వారా వచ్చే నీరు కేవలం కమాన్‌పూర్, రామగిరి మండలాల్లోని కొన్ని గ్రామాల ఆరుతడి పంటలకే అందుతుంది. మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లోని చివరి ఆయకట్టుకు సాగు నీరందడం లేదు. చాలా కాలంగా భూములన్నీ బీళ్లుగా ఉంటున్నాయి. కాగా, డీ–83 కాల్వపై భారాన్ని తగ్గించడమే కాకుండా ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో ఉన్న 20 వేల ఎకరాలు, టెయిలెండ్‌లో ఉన్న చివరి భూములు, కొత్తగా 10 వేల ఎకరాలను సాగులోకి తీసుకురావడం కోసం ప్రతిపాదించిన పోతారం ఎత్తిపోతలపై తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇది రైతులను నిరాశకు గురిచేస్తోంది.

గత ఆగస్టులో జిల్లాకు వచ్చిన సీఎం

మంథని మండలంలోని పోతారం–విలోచవరం గ్రామాల మధ్య ఎత్తిపోతల ద్వారా మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోయాలని అధికారులు ప్రతిపాదించారు. పోతారం నుంచి సుందిళ్ల, ఎల్–8 నుంచి చల్లపల్లి, ఎల్–6 నుంచి కన్నాల వరకు మూడు పైపులైన్లు ఏర్పాటు చేసి, సాగునీటి సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేసారు. పథకానికి రూ.320 కోట్ల మంజూరుకు ఆర్థిక శాఖ అనుమతి లభించింది. పరిపాలనా అనుమతులే పెండింగ్‌లో ఉన్నాయి. ఆగస్టులో సీఎం కేసీఆర్ జిల్లాకు వచ్చిన సమయంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పోతారం ఎత్తిపోతలపై వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు సైతం అవసరమైన చర్యలు తీసుకున్నారు. కానీ ఏడాది కావస్తున్నా ఎత్తిపోతల ఊసే లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమతున్నాయి.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ నాయకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. లోడర్స్, హౌస్‌కీపింగ్, బెల్ట్ సెక్షన్, బ్యాగింగ్, స్టిచ్చింగ్ ఆపరేటర్లకు మెరుగైన వేతనాలు చెల్లించాలన్నారు. లోడింగ్ విభాగం కార్మికులకు అలవెన్స్, ఇన్సెంటివ్స్ ఇప్పించేలా చూడాలని విన్నవించారు. స్పందించిన ఆయన కార్మికుల ముఖ్యమైన డిమాండ్లు నెరవేరుస్తామని, త్వరలోనే అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబటి నరేశ్, కొమ్ము రాజేశ్, బొడ్డుపల్లి రాజు, సార్ల ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

కొండగట్టులో నీటి సమస్యకు పరిష్కారం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- రూ.13.43 కోట్లతో ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్ తదితరులు

మల్యాల(చొప్పదండి): 'చెప్పింది చేస్తాం.. అనుకున్నది సాధిస్తాం.. తెలంగాణ తెస్తామని తెచ్చి చూపించినం.. కోటి ఎకరాలకు సాగు నీరందిస్తున్నాం' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నప్పుడు నీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని, దీంతో కొండగట్టులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని వరదకాలువ 81.10కిలో మీటరు వద్ద రెండు మోటార్లతో నిత్యం 10వేల క్యూసెక్కులను సంతలోని లొద్దిలోకి ఎత్తిపోసేందుకు రూ.13.43కోట్ల నిధులు కేటాయించగా, గురువారం వినోద్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ భాషా, గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. నాలుగు నెలల్లో ఎత్తిపోతల పనులు పూర్తిచేసి కొండగట్టుపైకి వరదకాలువ నీటిని తరలించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, కొండగట్టును అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే రవిశంకర్ చొరవను మంత్రి అభినందించారు. అంజన్న సన్నిధికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రామ్మోహన్ రావు, ప్రశాంతి, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, పునుగోటి కృష్ణారావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, ఉప సర్పంచ్ కొండబత్తిని త్రినాథ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మ

కమాన్‌పూర్: ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–2 గని ఆవరణలో గురువారం సీజనల్ వ్యాధులపై సింగరేణి వైద్యాధికారి డాక్టర్ పద్మ కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కార్మికులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలుషితమైన నీటి ద్వారా వ్యాధులు వ్యాపిస్తాయని, కాచి, వడగట్టిన నీటిని తాగాలని, వేడి వేడి పదార్థాలను ఆహారంగా తీసుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనారోగ్యంగా అనిపిస్తే వెంటనే వైద్యుల వద్దకు వెళ్లి, చికిత్స పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ఓసీపీ–2 గని మేనేజర్ రామారావు, రక్షణ అధికారి ఆసిఫ్ యాసిన్, పర్యావరణ అధికారి నాగేశ్వర్‌రావు, డాక్టర్ ఉదయ్‌కుమార్, రవిశంకర్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఎస్‌అండ్‌పీసీ నూతన కమిటీ ఎన్నిక

గోదావరిఖని: ఏఐటీయూసీ ఆర్జీ–1 ఎస్‌అండ్‌పీసీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రెడ్డి వెంకటస్వామి, సహాయ కార్యదర్శులుగా తిరుపతి, శ్రీనివాస్‌తోపాటు 15 మంది డెలిగేట్స్ ఎన్నికయ్యారు. గోదావరిఖనిలో నిర్వహించిన సమావేశంలో నాయకులు ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, గండి ప్రసాద్, బుర్ర భాస్కర్, ఎస్.వెంకట్‌రెడ్డి, బోగ సతీశ్‌బాబు, తాని రాజబాబు, ఆకునూరి శంకరయ్య, చెప్యాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఆర్టీసీ డీఎంకు సన్మానం



డీఎం మల్లేశంను సన్మానిస్తున్న ఉద్యోగులు

గోదావరిఖనిటౌన్: బదిలీపై హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ గోదావరిఖని డిపో మేనేజర్ పి.మల్లేశంను ఉద్యోగులు గురువారం ఘనంగా సన్మానించారు. డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయనను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. డీఎంగా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే ఉద్యోగుల సంక్షేమానికి, డిపో అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వెల్ఫేర్ బోర్డు సభ్యుడు స్వామి, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ గీతాకృష్ణ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ కవిత, సెక్యూరిటీ హెడ్ వలీమహమ్మద్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రవీణ్‌కుమార్

గోదావరిఖని: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ కొత్త సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. మద్యం సేవించి, వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని పేర్కొన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి, డ్రైవింగ్ చేయాలన్నారు. కార్లు నడిపేవారు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. హైవే రోడ్లపై నిర్ణీత వేగానికి మించి, ప్రయాణిస్తే జరిమానా విధిస్తామన్నారు. వాహనాలపై పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకోవాలన్నారు. నిత్యం రద్దీగా ఉండే లక్ష్మీనగర్ వంటి ప్రాంతాల్లో పగటిపూట భారీ వాహనాలు ప్రవేశిస్తే ఊరుకోబోమని పేర్కొన్నారు. షాపుల యజమానులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

గోదావరిఖని ఏసీపీగా బాధ్యతలు



శ్రీనివాసరావు

గోదావరిఖని: గోదావరిఖని సబ్‌డివిజన్ ఏసీపీగా తులా శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏసీపీ గిరిప్రసాద్ బదిలీపై వెళ్లడంతో ఇక్కడికి వచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా ముందుకు సాగుతామన్నారు.

ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

గోదావరిఖని: సింగరేణి రామగుండం డివిజన్–1 ఆధ్వర్యంలో ఉచిత స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, నిరంతర యోగా కేంద్రాల్లో యోగా శిక్షణ కోర్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు, సింగరేణి ప్రభావిత, నిర్వాసిత ప్రాంతాల పిల్లలు అర్హులని పేర్కొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం.. రైతుల్లో హర్షం

- జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులకు జలకళ
- 301.1 మి.మీ. వర్షపాతం నమోదు



గోదావరి నీటిలో శ్రాద్ధ మండపం

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా పడుతున్న వానతో ప్రాజెక్టులు, చెరువుల్లోకి వరదనీరు వచ్చి, జలకళ సంతరించుకున్నాయి. వరద నీరు చేరుతుండటంతో సింగరేణి ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోంది.

ఎల్లంపల్లికి వరద నీరు

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో 148 మీటర్ల ఎత్తులో 20.175 టీఎంసీల నీటి సామర్థ్యం కాగా ప్రస్తుతం 146.20 మీటర్ల ఎత్తులో 15.377 టీఎంసీల నీరు ఉంది. 8,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో అంతే నీటిని దిగువకు వదులుతున్నారు.

4 మండలాల్లో లోటు వర్షపాతం

ప్రస్తుతం కురుస్తున్న వాన కొంత ఊరటనిచ్చినా జిల్లాలో ఇంకా 10 శాతం లోటు వర్షాపాతమే ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 334.8 మి.మీ. కాగా 301.1 మి.మీ. నమోదైంది. మరో వారం రోజులు వర్షాలు పడితే వ్యవసాయ పనులకు ఢోకా ఉండదని రైతులు అంటున్నారు.

గోదావరికి పెరుగుతున్న వరద

మంథని: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మంథని వద్ద గల గోదావరికి వరద పెరుగుతోంది. నదిలో వరద గోడలు, శ్రాద్ధ మండపంతోపాటు శివలింగాలు నీటమునిగాయి. శ్మశానవాటిక సమీపంలో నీటి ప్రవాహం కొనసాగుతోంది.

నిండుకుండలా పార్వతి బ్యారేజీ

మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతి బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. బ్యారేజీ సామర్థ్యం 8.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.729 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సరస్వతి పంపుహౌస్ నుంచి రెండు రోజుల ఎత్తిపోతలను నిలిపివేశారు.

బీఎల్‌వోలకు శిక్షణ ప్రారంభం



శిక్షణ ఇస్తున్న అధికారులు

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గ బీఎల్‌వోలకు శిక్షణను ఎన్టీపీసీ టీటీఎస్‌లోని మిలీనియం హాలులో గురువారం ప్రారంభించినట్లు మాస్టర్ ట్రైనర్ గద్దె శ్రీనివాస్ తెలిపారు. అంతర్గాం తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లకు ఐదు రోజులపాటు రోజుకు 50 మందికి చొప్పున ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా ఫొటో ఎలక్టోరల్ రోల్స్ తయారీలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించడంలో ప్రధాన భూమిక పోషించాలని చెప్పారు. అబ్జర్వర్ ఆగయ్య, మాస్టర్ రిసోర్స్ పర్సన్ అంజన్‌కుమార్, గద్దె శ్రీనివాస్, సంతోష్‌కుమార్, శ్రీధర్, నాగరాజు పాల్గొన్నారు.

మూల వేతన నిర్ధారణపై ఆడిట్

గోదావరిఖని: రామగుండం రీజియన్‌లోని 20 వేల మంది ఉద్యోగులకు 11వ వేతన ఒప్పందానికి సంబంధించిన ఖచ్చితమైన మూలవేతన నిర్ధారణ కోసం నాలుగు రోజులుగా ఆడిట్ నిర్వహిస్తున్నారు. రీజియన్ ఆడిట్ డీజీఎం ఇంటర్నల్ ఆడిట్ ఎన్.రాజం, ఫైనాన్స్ మేనేజర్ పి.మోహన్‌రావు సమక్షంలో కార్యక్రమం చేపట్టారు. బేసిక్ ఫిక్సేషన్ కోసం 30 మంది క్లరికల్ సిబ్బంది పాల్గొంటున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

రామగుండం:రామగుండం–రాఘవాపూర్ రైల్వేస్టేషన్ల మధ్య గురువారం ఇంటర్‌సిటీ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. నీలి, ఎరుపు రంగు టీషర్ట్, నీలి రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని, 35 ఏళ్ల వయసు ఉంటుందని, మతిస్థిమితం లేదని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బంధువులు ఎవరైనా 99493 04574, 87126 58604 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జి తిరుపతి పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

కమాన్‌పూర్: ముత్తారం మండలం ఓడేడ్‌కు చెందిన మాదాసి శ్రీనివాస్(33) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స పొందినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. గత బుధవారం క్రిమిసంహారక మందు తాగగా కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

- ఆస్పత్రికి తరలించిన జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న చైర్మన్ మధు

కమాన్‌పూర్: బైక్ అదుపుతప్పి సెంటినరీకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు ఏదెల్లి భాస్కర్ రెడ్డికి గాయాలయ్యాయి. భాస్కర్‌రెడ్డి గురువారం బైక్‌పై వెళ్తుండగా రామగిరి మండలం మంథని జేఎన్‌టీయూ ఎదుట పంది అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో అతను గాయపడ్డాడు. అదే సమయంలో ఓ కార్యక్రమానికి కమాన్‌పూర్ వెళ్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు రోడ్డుపై పడిపోయిన భాస్కర్‌రెడ్డిని చూసి తన కారును ఆపారు. పోలీసులకు సమాచారం అందించి, బాధితుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి, మానవత్వం చాటుకున్నారు.

ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో మరొకరికి..

జ్యోతినగర్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సైజీవన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లికి చెందిన సంతోష్ గురువారం ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో గాయపడ్డాడు. స్థానికులు అతన్ని గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారని ఎస్సై పేర్కొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ వాయిదా

సుల్తానాబాద్: అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ తెలిపారు. వర్షాల కారణంగా రాష్ట్రప్రభుత్వం పాఠశాలలకు రెండురోజులు సెలవు ప్రకటించడంతో మాత్రల పంపిణీని నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రలు ఎప్పుడు వేసేది ప్రకటిస్తామని తెలిపారు.

నూకలమర్రి అమరులకు అరుణోదయ నివాళి



హైదరాబాద్ అరుణోదయ ఆఫీస్‌లో నూకలమర్రి అమరులకు నివాళి అర్పిస్తున్న జనశక్తి నేత అమర్, విమలక్క

సిరిసిల్ల: వేములవాడరూరల్ మండలం నూకలమర్రిలో 23 ఏళ్ల కిందట అమరులైన వారికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గురువారం నివాళి అర్పించింది. హైదరాబాద్‌లోని అరుణోదయ ఆఫీస్‌లో నూకలమర్రి అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జనశక్తి మాజీ రాష్ట్ర కార్యదర్శి కూర దేవేందర్ అలియాస్ అమర్, ఆయన భార్య, అరుణోదయ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క అమరులకు జోహార్లు అర్పించారు. 23 ఏళ్ల కిందట అమర్ రాసిన 'నల్ల నల్ల రేగళ్ల నల్ల రేగళ్ల ఎర్ర కలువ పూలు పూసే' పాటను విమలక్క బృందం ఆలపించింది. నూకలమర్రి ఎన్‌కౌంటర్‌లో అమరులైన అశోక్, జ్యోతి, చైతన్య, మల్లేశం, గనికంటి పర్శరాములు, సముద్రాల ఎల్లేందర్, దొంతుల రమేశ్‌లకు నివాళి అర్పించారు. అరుణోదయ జంట నగరాల అధ్యక్ష, కార్యదర్శులు పోతుల రమేశ్, రాకేశ్, అరుణోదయ సిటీ కమిటీ సభ్యులు విశాల, హరికృష్ణ, పీడీఎస్‌యూ(విజృంభన) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏపూరి పవన్ తదితరులు పాల్గొన్నారు.